క్లుప్తంగా

డాక్టర్ చంద్రశేఖర్‌కు ఘన సత్కారం



డాక్టర్ చంద్రశేఖర్ భార్య, పిల్లల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న హరీష్

కాకినాడ రూరల్: సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టరు సంకురాత్రి చంద్రశేఖర్‌కు పద్మశ్రీ పురస్కారం రావడంపై హరీష్ చారిటబుల్ ట్రస్ట్ ఆదివారం ఘనంగా సత్కరించింది. ట్రస్ట్ అధ్యక్షుడు తలాటం హరీష్ పెనుమర్తిలో ఆయనను కలిసి అభినందించి సత్కరించారు. ఆయన భార్య, పిల్లల విగ్రహాలకు హరీష్ నివాళులర్పించారు. ట్రస్ట్ మేనేజరు సుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు.

రబీలో కాలిబాటలతో అధిక దిగుబడి



కరపలో ఊడ్చిన పొలంలో కాలిబాటలు తీస్తున్న అన్నదాత

కరప: రబీలో కాలి బాటలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఎకరాకు రూ.వెయ్యి నుంచి రూ.1200 అదనపు వ్యయమైనప్పటికీ దీని వల్ల నాలుగు నుంచి ఆరు బస్తాల అదనపు దిగుబడి సాధించవచ్చని ఎంపీఏఓ ఏవీ రాజేష్ అంటున్నారు. నాట్ల అనంతరం కాలిబాట వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు. అధికశాతం రైతులు వెదజల్లును అనుసరించారు. ఆలస్యమైన ప్రాంతాల్లో, మెరకభూముల్లో వరి నారు పెంచి, సంప్రదాయ పద్ధతిలో, బెంగాలు కూలీలతో ఊడ్పులు ద్వారా వరినాట్లు వేస్తున్నారు. కాలిబాటల వల్ల వరి మొదళ్లకు గాలి, వెలుతురు తగిలి చీడపీడలు ఆశించవని రాజేష్ తెలిపారు.

కాలువల్లో మట్టి తొలగించండి



డ్రైనేజీలో నిండుగా ఉన్న మట్టి

బోట్‌క్లబ్: స్థానిక విద్యుత్‌నగర్ ఐడియల్ కళాశాల రోడ్డులోని డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయి. మురుగునీరు వెళ్లేందుకు వీలు లేకుండా పూడుకుపోయింది. 20 రోజులుగా ఇదే పరిస్థితి ఉండడంతో సమీప ప్రజలు దుర్గంధంతో అవస్థ పడుతున్నారు. కార్పొరేషన్ అధికారులు పూడిక తొలగించి సత్వర చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పెరిక పురగిరి క్షత్రియ సంక్షేమానికి కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు బద్రి

బోట్‌క్లబ్: పెరిక పురగిరి క్షత్రియ కుల బంధువుల సంక్షేమానికి 15 ఏళ్లుగా కృషి చేస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు వనపర్తి బద్రి తెలిపారు. స్థానిక సినిమా రోడ్డులోని సూర్యకళామందిరంలో ఆదివారం పెరిక పురగిరి క్షత్రియ ఉచిత వధూవరుల వివాహ పరిచయ వేదికను ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. 350 మంది వధూవరులు పాల్గొని వారి వివరాలు వివరించారు. సంఘ ప్రధాన కార్యదర్శి చిత్తులూరి శ్రీనివాస్, ట్రెజరర్ కామిరిశెట్టి నరసింగరావు, కన్వీనర్ గొసుల సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

విపత్తు వేళ రక్షణ ఇలా..

ఆపదమిత్రలకు ఎస్‌డీఆర్‌ఎఫ్ శిక్షణ

సామర్లకోట: వరదల్లో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలో ఆపద మిత్రలకు ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ప్రయోగాత్మకంగా వివరించారు. ఫీల్డ్ విజిట్‌లో భాగంగా కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లకు చెందిన 113 మంది ఆపద మిత్రలకు ఇస్తున్న శిక్షణలో భాగంగా ఆదివారం పెద్దాపురం మండలం జి.రాగంపేట పంచాయతీ చెరువులో ప్రమాదవశాత్తు మునిగిపోతున్న వాళ్లని ఎలా రక్షించాలో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం చేసి చూపారు. తుపాను, వరదల్లో స్పందించాల్సిన పద్ధతులు, ప్రథమ చికిత్సలపై అవగాహన కల్పించారు. జి.రాగంపేట సర్పంచ్ బుంగా శేఖర్‌బాబు సహకారంతో స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పించారు. తుపాన్, వరదల సమయాల్లో మత్స్యశాఖ సహకారం అవసరం ఉంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఆయా శాఖ అధికారులకు వెంటనే ఆపద సమాచారం ఇవ్వాలని విపత్తుల నివారణ సంస్థ జిల్లా మేనేజర్ కిరణ్మయి తెలిపారు.

తూర్పున గట్టి బేస్

- రాణిస్తున్న క్రీడాకారులు
- గ్రామీణంలో పెరుగుతున్న ఆదరణ
- జిల్లాలో 700 మంది క్రీడాకారులకు శిక్షణ
- పోలీస్, ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలకు అవకాశం



బేస్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్: అమెరికాలో దేశ క్రీడ బేస్‌బాల్ మన దేశంలోనూ ఆదరణ పొందుతోంది. 1983లో మనదేశంలో ప్రారంభమైన ఈ క్రీడను మొదటిసారిగా 1985లో జాతీయ క్రీడలో చేర్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1987లో బేస్‌బాల్ ఫెడరేషన్ ప్రారంభించే స్థాయికి ఎదిగింది. ఫిట్‌నెస్, వేగం అవసరమైన ఈ క్రీడలో ప్రభుత్వ పాఠశాల క్రీడాకారులు రాణించి పోలీస్, ఎయిర్ ఫోర్స్, సచివాలయ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 700 మంది వివిధ ప్రాంతాల్లో ఈ క్రీడలో శిక్షణ పొందుతున్నారు. 2008 వరకు అండర్–19 పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో బాలురు, బాలికలకు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించేవారు. అనంతరం అండర్–14, 17 బాలురు, బాలికల కేటగిరీలను చేర్చారు.

దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పాలగుమ్మి, రావులపాలెం, పొనమండ, రాజమహేంద్రవరం, గొల్లపాలెం, పెద్దారప్పాడు ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు కోచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. కోవిడ్ కాలానికి ముందు 2008 నుంచి 2018మ వరకు సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో అండర్–14, 17 లో రాష్ట్రస్థాయిలో ఏదో ఒక స్థానంలో తూర్పు క్రీడాకారులు తమ సత్తా చాటారు. ప్రస్తుతం స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న 66వ పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–14, 17 బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు తమ ప్రతిభ చూపుతూ వారి అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నారు.

ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది



సీఎం జగన్ ప్రభుత్వం పాఠశాల స్థాయి క్రీడలకు పెద్దపీట వేసింది. నాడు–నేడులో భాగంగా పాఠశాలల్లో క్రీడా మైదానాలు అభివృద్ధి చేస్తోంది. హైస్కూళ్లలో వ్యాయామ ఉపాధ్యాయుల నియామకం వల్ల, వారికి బేస్‌బాల్‌పై అభిరుచి ఉండడం వల్ల ఆయా పాఠశాలలో ఉదయం, సాయంత్రం ఈ క్రీడలో శిక్షణ ఇస్తున్నాం.

– ప్రసాద్, బేస్‌బాల్ కోచ్

రాష్ట్రస్థాయిలో ఆడడం ఇదే తొలిసారి



నా పేరు కె.మోహన్ సాయి మణికంఠ. పొనమండ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. బేస్‌బాల్ అంటే ఇష్టం. రాష్ట్రస్థాయి పోటీల్లో తొలిసారి పాల్గొంటున్నా. బాలుర విభాగంలో అండర్–14 జట్టు ముందంజలో ఉండడం ఆనందంగా ఉంది.

5వ తరగతి నుంచి నేర్చుకుంటున్నాను



నా పేరు డి.సూర్యవెంకట మణికంఠ. పెద్దారప్పాడు స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నా. 5వ తరగతి నుంచి ఈ క్రీడలో శిక్షణ పొందుతున్నా. కోవిడ్ వల్ల రెండేళ్లుగా క్రీడలకు దూరంగా ఉన్నాం. ఈ ఏడాది పోటీలు జరగడం సంతోషంగా ఉంది. జాతీయస్థాయిలో రాణించడం నా ఆశయం.

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలి



నా పేరు కె.సాకేత్‌. పెద్దారప్పాడు ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నా. రెండేళ్లుగా బేస్‌బాల్‌లో శిక్షణ పొందుతున్నాను. బేస్‌బాల్‌లో రాణించి పోలీస్ ఉద్యోగం సాధించడం నా లక్ష్యం.

ఉత్సాహంగా బేస్‌బాల్ పోటీలు



ఎస్‌జీఎఫ్‌ఐ బేస్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్: పాఠశాల క్రీడాసమాఖ్య అండర్–14, 17 ఆధ్వర్యంలో స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్‌ఐ బేస్‌బాల్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. అండర్–14, 17 బాలురు, బాలికల విభాగంలో నిర్వహించిన మ్యాచ్‌లను ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్ పర్యవేక్షించారు. అండర్–17 బాలుర విభాగంలో కర్నూల్, గుంటూరు, శ్రీకాకుళం, ప్రకాశం జట్లు క్వాటర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. బాలికల విభాగంలో కడప, ప్రకాశం, విజయనగరం, శ్రీకాకుళం జట్లు క్వార్టర్స్ దశకు వచ్చాయి. మ్యాచ్‌ల నిర్వహణలో సీనియర్ పీడీలు బంగార్రాజు, రంగారావు, గిరి, పట్టాభి, శ్రీను, స్వామి, వెంకటేశ్వరరావు, శిరీష సహకారం అందించారు.

ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కాకినాడ సిటీ: ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని యూటీఎఫ్ జిల్లా నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం కచేరీపేట యూటీఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ, జిల్లా అధ్యక్షుడు కేవీవీ నగేష్, ప్రధాన కార్యదర్శి టి రవిచక్రవర్తి, అసోసియేట్ అధ్యక్షుడు ఐ ప్రసాదరావు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సరెండర్ లీవ్, డీఏలు, ఏపీజీఎల్ఐ తదితర ఆర్థిక బకాయిలు చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా శాఖ రూపొందించిన 2023 క్యాలెండర్‌ను వారు ఆదివారం ఆవిష్కరించారు.

భావనారాయణుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

- ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కన్నబాబు
- నిత్యాన్నదానానికి చర్యలు తీసుకుంటామని వెల్లడి



సర్పవరం ఆలయంలో భక్తులకు సౌకర్యాలు తెలుసుకుని వారికి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: మాఘ మాసం వచ్చిందంటే సర్పవరం గ్రామానికి తిరునాళ్లు వచ్చినట్టే. ప్రసిద్ధి గాంచిన రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయానికి ఈ మాసంలో వేలాదిగా భక్తులు తరలి వస్తారు. స్వామివారిని సూర్యుని ప్రతిరూపంగా భావించి ఆవుపాలతో పొంగలి తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు. తెల్లవారు జామునుంచే మహిళలు పొంగలి తయారు చేస్తూ కనిపించారు. ఆలయ ఈవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బందితో పాటు ఆలయ పాలకమండలి చైర్మన్ పుల్ల నారాయణరావు, సభ్యులు భక్తులకు ఏర్పాట్లు చేశారు. భక్తులకు క్యూ లైన్లు ఏర్పాటుతో పాటు దర్శనానంతరం అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు సహకారంతో ఏర్పాటు చేసిన అన్న ప్రసాదం అందరికి అందేలా పుల్ల చందు, సర్పంచ్ శీలం చిన్న, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, చక్రధర్ తదితరులు వడ్డన చేశారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్వయంగా ఏర్పాట్లు పరిశీలించి అక్కడి సౌకర్యాలను భక్తులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఆయన అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ స్వామివారి ఆలయాన్ని నారదుడు ప్రతిష్ఠించినట్టు ప్రతీతి అని, ఈ ఆలయానికి పిఠాపురం వచ్చే మహారాష్ట్ర భక్తులు ఇటీవల కాలంలో ఇక్కడకు వస్తున్నారని, వారి కోసం హిందీలో బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు. ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని అన్నారు. నిత్యాన్నదానం ఏర్పాటు చేయాలన్నది తన ఆకాంక్ష అని, దానికి తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.



సర్పవరం ఆలయంలో క్యూలో దర్శనాల కోసం వేచి ఉన్న భక్తులు

ఆసక్తిగా కాకరపర్తి అష్టావధానం

కాకినాడ కల్చరల్: స్థానిక విద్యుత్‌నగర్‌లోని చల్లా కల్యాణమండపంలో ఆదివారం ఉదయం అస్వాదన సమితి ఆధ్వర్యంలో విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు కాకరపర్తి దుర్గాప్రసాద్ అష్టావధానం జరిగింది. అష్టావధానం ఆద్యంతం ఆసక్తిగా జరిగింది. ప్రముఖ శతావధాని డాక్టర్ పోచినపెద్ది సుబ్రహ్మణ్యం నిషిద్ధాక్షరి, కవి కొరుప్రోలు గౌరినాయుడు అప్రస్తుత ప్రసంగం చేశారు. ఆ కార్యక్రమంలో డాక్టర్ బలుసు అపర్ణ, పోతరాజు, జోస్యుల కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గోదాకల్యాణం నృత్య ప్రదర్శన



గోదాకల్యాణంలో ఒక దృశ్యం

కాకినాడ కల్చరల్: నాట్యాచార్య వేదాంతం రామలింగశాస్త్రి ఆధ్వర్యంలో ప్రదర్శించిన గోదా కల్యాణం నృత్యం ఆకట్టుకొంది. సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో స్థానిక సూర్యకళామందిర్‌లో 75వ సంక్రాంతి వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. ముందుగా జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభించారు. దీనిలో భాగంగా ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన గోదా కల్యాణం నృత్యరూపకం ప్రదర్శించారు. సభ అధ్యక్షుడు నారాయణం మురళి, కార్యదర్శి వక్కలంక రామకృష్ణ, ఎం.నాగేశ్వరావు, ఆర్.ఎ.రావు, భారతలక్ష్మి, ఎస్‌కెవీడీ వెంకట్రావు, మణిబాబు, కృష్ణంరాజు, కొమ్మురెడ్డి శ్రీరామనరసింహారావు, గోపి పక్కంరాజు పాల్గొన్నారు.

నాట్యకారిణులకు నర్తన కిరణం పురస్కారాలు



విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేస్తున్న దృశ్యం

కాకినాడ కల్చరల్: కాకినాడకు చెందిన బాలత్రిపుర సుందరి నృత్యనికేతన్, కూచిపూడి నాట్య అకాడమీ విద్యార్థులకు నర్తన కిరణం అవార్డులు ప్రదానం చేశారు. విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో విశాఖ శాస్త్రీయ నాట్యగురువుల సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం నృత్య కళాతోరణం పేరుతో వేడుకలు నిర్వహించారు. అకాడమీ విద్యార్థులు చక్కని హావభావాలతో నృత్య ప్రదర్శనలు చేసి ఆకట్టుకొన్నారు. వీరికి నర్తనకిరణం పురస్కారం, అకాడమీ నాట్యాచార్య బేతా సత్యనారాయణకు గురు సామ్రాట్ పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. నగర ప్రముఖులు వీరిని అభినందించారు.

ఉత్సాహంగా సూర్య నమస్కారాల పోటీలు



పిఠాపురంలో విద్యార్థుల సూర్యనమస్కారాలు

పిఠాపురం: పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ హైస్కూలు ఆటస్థలంలో రథసప్తమిని పురస్కరించుకుని ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సామూహిక సూర్య నమస్కారాల పోటీ నిర్వహించారు. పోటీకి 15 పాఠశాలలకు చెందిన 228 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సూర్యనమస్కారాలు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు గట్టి అశోక్, మురాలశెట్టి సునీల్, రవి శంకర్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పెమ్మరాజు సత్యరామచంద్రరావు, శ్రీనివాస్, శంకర్, వీరభద్రరావు, సత్యమోహన్, యోగా శ్రీనివాస్, పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: మండలంలోని నాగులపల్లి ఉమారామలింగేశ్వర ఆలయం వద్ద ఆదివారం సేవా భారతి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో సూర్య నమస్కార పోటీలు నిర్వహించారు. రథసప్తమి సందర్భంగా నిర్వహించిన ఈ పోటీలకు ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడు సుబ్బారావు హాజరయ్యారు. పోటీల్లో పాల్గొన్నవారికి సీనియర్, జూనియర్ విభాగాల్లో బహుమతులను అందించారు. రామేశ్వరరెడ్డి, రాజు, శ్రీనువాస్‌రెడ్డి పాల్గొన్నారు.



కొత్తపల్లిలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

ఫోర్జరీ సంతకాలపై ఫిర్యాదు

సామర్లకోట: ఫోర్జరీ సంతకాలతో తప్పుడు అగ్రిమెంట్ సృష్టించారని పోకల ఝాన్సీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు సీఐ కె దుర్గాప్రసాద్ ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ శివప్రసాద్ ఫోర్జరీ సంతకాలు కలిగిన తప్పుడు అగ్రిమెంటు సృష్టించిన్నట్లు ఝాన్సీదేవి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. శివప్రసాద్‌తో పాటు అతనికి సహకరించిన వి.శ్రీప్రకాష్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

చిన్నారులే సంస్కృతీ సారథులు

- ఆకట్టుకుంటున్న బాలల నటనా దీప్తి
- శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్న అల్లూరి స్మారక కళావేదిక



బాలలు నటించిన అల్లూరి సీతారామరాజు నాటకంలో సన్నివేశం

కాకినాడ కల్చరల్: భారత సంస్కృతికి చిహ్నాలైన కళలకు ఆ చిన్నారులు సారథులుగా నిలుస్తున్నారు. కేవలం చదువుకే పరిమితం కాకుండా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సాంస్కృతిక వేదికలపై సత్తా చాటుతున్నారు. బాలలకు సీతారామరాజు స్మారక కళావేదిక నాటకరంగంలో తర్ఫీదునిస్తూ వారిలోని ప్రతిభను వెలికి తీస్తోంది. అల్లూరి సీతారామరాజు, శశిరేఖా పరిణయం తదితర నాటకాల్లో పాత్రోచితంగా నటిస్తూ ప్రేక్షకుల మెప్పు పొందుతున్నారు ఆ చిన్నారులు.

గొప్ప నటుడిని అవుతాను..



నా పేరు జయవీరకృష్ణ, శ్రీచైతన్య ఇంటర్నేషనల్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నా. మా తాత రంగస్థల నటుడు, దర్శకుడు కావడంతో నాకూ నటనపై ఆసక్తి పెరిగింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సీతారామరాజు స్మారక కళావేదిక ఆధ్వర్యంలో నటనలో మెళకువలు నేర్చుకున్నాను. సీతారామరాజు పాత్రకు అభినందనలు రావడం ఆనందాన్నిచ్చింది. గొప్ప నటుణ్ణి కావాలనేది నాలక్ష్యం

నటన అంటే ఇష్టం



నా పేరు కంటిబోయిన జస్విన్, 4వ తరగతి చదుతున్నాను. చిన్నప్పటి నుంచి నటన అంటే ఇష్టం. మంచి నటుడుని కావాలనేదే ఆశయం. వేదికలో నటనలో శిక్షణ ఇస్తున్నారని తెలిసి మా అమ్మానాన్నలు ఇందులో చేర్చారు. అల్లూరి సీతారామరాజు నాటకంలో గంటం దొర పాత్రలో నటించాను. మరిన్ని నాటకాల్లో నటించాలని ఉంది.

బాధ్యతగా భావించి



మా తరం నటుల శకం ముగియక మూందే నూతన తరాన్ని ప్రోత్సాహించాల్సిన అవసరం ఉందని గ్రహించాను. ఈ క్రమంలో కళావేదిక ద్వారా చిన్నారులకి శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్నా. పరిషత్ నాటక పోటీల్లో వారు సత్తా చాటడం మా సంస్థకు గర్వకారణం.

– పంపన దయానందబాబు, సీతారాజరాజు స్మారక కళావేదిక, వ్యవస్థాపక కార్యదర్శి

తొలిసారిగా నటించా..



నా పేరు సాయిలక్ష్మి, పీఆర్‌జీసీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నా. పాఠశాలలో సీతారామరాజు స్మారక కళావేదిక వారు నాటకాలు వేస్తున్నారని తెలిసి అడిషన్స్‌లో పాల్గొన్నాను. అందులో నన్ను ఎంపిక చేసి శశిరేఖాపరిణయంలో శశిరేఖ పాత్ర ఇచ్చారు. తొలిసారి నటించి ప్రేక్షకుల మన్ననలు పొందాను. చాలా ఆనందంగా ఉంది.

అక్రమ తొలగింపులు ఆపాలి



ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ కాకినాడ శాఖ నూతన కార్యవర్గం

- మెడికల్ రిప్రజెంటేటివ్‌ల సమావేశం డిమాండ్
- నూతన కమిటీ ఏర్పాటు

కాకినాడ సిటీ: మెడికల్ రిప్స్ అక్రమ తొలగింపులు ఆపాలని, సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ యాక్ట్ పటిష్టంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటీవ్స్ యూనియన్ కాకినాడ శాఖ 49వ సర్వ సభ్య సమావేశం డిమాండ్ చేసింది. ఆదివారం శ్రీనగర్‌లోని కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ హాలులో నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. కరోనా సమయంలో ఫార్మ కంపెనీలు పెద్ద ఎత్తున లాభాలు సంపాదించుకుంటున్నా, అదే స్థాయిలో ఏ కారణం లేకుండానే మెడికల్ రిప్స్‌ను అక్రమంగా తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ రిప్స్‌కు పని నిబంధనలు రూపొందించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో చేపట్టిన ఆందోళన వల్ల కేంద్ర ప్రభుత్వం స్పందించి కమిటీని నియమించినట్లు సమావేశం తెలిపింది. అత్యవసర నిత్యావసర మందులపై జీఎస్టీ తొలగించాలని, ప్రభుత్వ వైద్య ఆరోగ్య రంగాలకు బడ్జెట్‌లో నిధులు పెంచాలని, మెడికల్ రిప్స్‌కు కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని సమావేశం తీర్మానించింది. యూనియన్ నాయకులు కె.అప్పారావు, సిహెచ్ కుమార్, గుంటూరు యూనిట్ అధ్యక్షుడు ఫణి సౌహార్థ, సీఐటీయూ నగర అధ్యక్షుడు పలివెల వీరబాబులు మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎంఎ స్వామి, కార్యదర్శిగా ఏఆర్‌సీ వర్మ, కోశాధికారిగా కె. రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా కె.అప్పారావు, దీక్షితులు, సహాయ కార్యదర్శులుగా శ్యాం, వెంకటేష్, కమిటీ సభ్యులుగా నాగేంద్రకుమార్, రాజేష్, అశోక్, రామ్మోహన్, సత్తిబాబు, నరేష్, కిశోర్, గుప్తా, షంషుద్దీన్, అప్పారావు, అయ్యప్ప, ప్రసాద్, దుర్గాప్రసాద్, హుస్సేన్, సుబ్రహ్మణ్యం, శ్రీధర్, కృష్ణ తదితరులు ఎన్నికయ్యారు.